# శాంతి మంత్రం

గోపాల్రావు ప్రమోషన్ మీద కొత్తగా మా ఆఫీసుకొచ్చాడు.

మనిషి ఆజానుబాహువు.

ఎప్పుడూ సీరియస్‌గా ఉండే మొహం.

పుట్టిన తర్వాత ఒక్కమారయినా నవ్వి ఉంటాడా అనే అనుమానం కలిగించే ముఖ కవళికలు.

ఆరా తీయగా తెలిసిందేమంటే, ఆయన కింకా పెళ్లికాలేదని! ఈ సీరియస్ మొహానికి వెనకాల భగ్న ప్రేమ కారణం కాదు కదా అని అభిజ్ఞవర్గాలు చర్చించాయి.

"ఆ... ఈయన మొహానికి ప్రేమ కూడానూ" అని ఓ లేడీ మెంబర్ విషయాన్ని కొట్టి పారేసింది. (ఆవిడకి చాలా భగ్నప్రేమ గాధలున్నాయని వినికిడి!) దాంతో ఆ కారణం వీగిపోయింది.

ఇంకా వేరే కారణాలు ఏముంటాయి?

పరిశీలన, పరిశోధనల్లో పడ్డారు స్టాఫ్.

గోపాల్రావు మితభాషి. రోజు మొత్తంమీద నాలుగు మాటలు.

ఆ మాటలు కూడా చాలా పదునుగా, కరుగ్గా ఉంటాయి.

అన్నట్టు మా లేడీ స్టాఫ్‌మెంబరు పేరు మోహిని.

'మేకప్'లో చాలా మోహనంగా ఉంటుంది.

సోగకళ్లు.

బంతిపూలతో కొడుతున్నట్లు మాటల విసుర్లు.

ఛలోక్తులతో, నవ్వులతో సరదాగానే ఉంటుంది. అయితే ఆఫీసులో నిశ్శబ్దంగా లేకపోతే గోపాల్రావ్‌కి వెర్రి కోపం వస్తుందని రెండు మూడు సంఘటనలతో అందరికీ తెలిసిరావటం వల్ల సరదా కాలక్షేపానికి తెరపడింది.

పూర్వం ఆఫీసు గడియారం చప్పుళ్లు ఎవరికీ వినపడేవి కావు. ఇప్పుడు సలక్షణంగా వినిపిస్తున్నాయి. గుండు సూది పడిన శబ్దం సైతం వినిపిస్తోందంటే అతిశయోక్తి లేదు. ఎందుకయినా మంచిదని, మా ఆఫీసు చీమలు 'చిటుక్కు' మనటం మానేసాయి.


ఇలా రోజులు భారంగా గడుస్తుండగా ఓ మాటు మా ఆఫీసుకు హెడ్డాఫీసు నుంచి ఇన్‌స్పెక్షన్ టీమ్ వచ్చింది. ఆ టీమ్ హెడ్ శాంతి అనీ ఓ అరవ పడచు. మనిషికి ఎక్కువ వయస్సుండదు కానీ, ఛార్టెడ్ అక్కౌంటెన్సీ మెరిట్‌లో ప్యాసయి, సీనియర్ ఆడిటర్‌గా ఉద్యోగం సంపాయించింది. 'అ' దగ్గర్నుంచీ ఆఖరి అక్షరం వరకూ సమూలంగా తనిఖీ చేసి రెండు కిలోల ఫైలు తయారుచేసింది. అందులో చేర్చబడిన అవకతవకల లిస్టు చూసేసరికి గోపాల

రావు బుర్ర తిరిగిపోయింది. శాంతి లంచ్‌కి వెళ్లిన సమయం చూసి మోహినికి కబురు చేసాడు.

ఇద్దరూ ఏం మాట్లాడుకున్నారో తెలియదు గానీ మోహిని ముసిముసి నవ్వులతో బయటికి వచ్చింది. అందరూ ఆమెకేసి ఆశ్చర్యంగా, కుతూహలంగా చూసారు.

“ఏమిటి విషయం?” అని మెల్లగా అడిగారు.

“ష్” అంటూ నోటికి చూపుడువేలు అడ్డం



"స్కూలుకి వెళ్లనని రోజూ మారాం చేస్తు న్నావు. వీపు చీరేస్తాను..." కొడుకుపై గయ్‌మంది తల్లి.

"నాన్న ఆఫీసుకి వెళ్లనంటే మురిసిపో తావు... నన్నెందుకు తిడతావు?" టక్కున ప్రశ్నించాడు కొడుకు.

– పోడూరి శ్రీ బదరీనారాయణ

ఉంచి మరీ భయపెట్టింది. ఎక్కడి వాళ్లక్కడ ఎరగనట్లు తమ పనుల్లో తలలు దూర్చారు.

శాంతి తిరిగి వచ్చాక, మోహిని వినయం గా ఆవిడ దగ్గరకు వెళ్లి, ఫైలులో రాసిన అబ్జెక్షన్లను సర్దిచెప్తూతూ వివరాలు ఇవ్వసా గింది.

నిజానికి ఈ పని సూపర్నెంటుది!

సూపర్నెంటుకి చెవుడు.

ఆ సంగతి ఆయన చెవిలో మిషనే చెబు తుంది.

అందువల్ల ఈ ఏర్పాటా?!

ఎవరికీ ఏమీ అర్థంకాలా.

మోహిని చెప్పిన వివరణలు వింటూ కొన్ని అభ్యంతరాలు తీసివేసింది. కొన్ని మార్చటానికి వీలులేదని పట్టుపట్టింది ఆడిటర్ శాంతి.

ఆ సాయంత్రం శాంతిని మోహిని తన వెంట గుడికి, ఇంకా కొన్ని ముఖ్యమయిన ప్రదే శాలకూ తీసుకెళ్లింది. మార్కెటింగ్ చేయిం చింది. హోటల్లోని ఏర్పాట్లు స్వయంగా పర్య వేక్షించింది. ఇవన్నీ సజావుగా చేసేందుకు అవ సరమయిన డబ్బు గోపాల్రావే ఇచ్చాడని తర్వా త తెలిసింది.

చివరికెలాగయితేనేమీ, గోపాల్రావ్ ప్రయ త్నాలు ఫలించి, శాంతి అభ్యంతరాలలో చాలా వరకు తగ్గించింది. అలా చూసినా పావుకిలో ఫైలు మిగిలింది.

ఇద్దరూ ఏకాంతంలో ఉన్నప్పుడు సిగ్గు విడి చి గోపాల్రావు తను కొత్తగా ప్రమోషనులో వచ్చాను గనుక సీరియస్ అభ్యంతరాలు లేకుం డా చూడమని, అలాంటివేమన్నా ఉంటే తక్ష ణం సరిచేసి చూపిస్తాననీ శాంతిని వేడుకున్నా డు.

ఆరడుగుల మొగాడు ఆడదాని ముందు అలా కుంచించుకుపోతున్నట్లు అభ్యర్థించటం శాంతికి నవ్వు తెప్పించింది. అయినా బయట పడకుండా "మీరు పిల్లల తండ్రా?" అనడి గింది.

గోపాల్రావు తెల్లబోయి "అలా అడిగా రేమిటి?" అన్నాడు.

"ఇంతకుముందు ఆఫీసు ఇనస్పెక్షను చేసినప్పుడున్న ఆయన మీరు చెప్పినవన్నీ చెప్పి, ఆఖర్న పిల్లలవాడ్ని కనికరించండి – అని కన్నీళ్లు పెట్టుకున్నాడు" అంది.


"నాకింకా పెళ్లి కాలేదు."

"కాలేదా! అయితే దిగులెందుకు?... అం తగా అయితే ట్రాన్స్‌ఫర్ చేస్తారు... అంతేగా?!" తేలిగ్గా అనేసింది.

గోపాల్రావ్ బేలగా చూసి "మా నాన్నగారు ఆస్పత్రిలో ఉన్నారు. ఆయనకి నేనొక్కడ్నే..." అన్నాడు.

"అయామ్‌సారీ... నేను ఛలోక్తిగా అన్నాను. మరోలా అనుకోకండి..." అని బయటకు వచ్చే సింది శాంతి.

అంతవరకూ ఈ 'సీను' చూస్తున్న అల్లాబక్షీ




నిటారుగా నిలబడి 'శాల్యూట్' కొట్టాడు.

శాంతి అతని వంక చురుగ్గా చూసి, మోహినిని వెంట బెట్టుకుని బయటకెళ్లింది.

గోపాల్రావ్ ఆ మర్నాడు ఆఫీసుకి వచ్చినప్పుడు చాలా విరుద్ధంగా కనిపించాడు. మనిషిలోని సీరియస్‌నెస్ బదులు మందహాసం, ప్రశాంతత అగుపించాయి.

మోహిని మరో విషయం చెప్పి అందర్నీ ఆశ్చర్యచకితుల్ని చేసింది. శాంతి ఆ ముందు రోజు సాయంత్రం గోపాల్రావ్ తండ్రిని చూట్టానికి ఆస్పత్రికి వెళ్లి; అక్కడ చాలాసేపు ఉందిట. ఆ ముసలాయన రిటైరయిన ఐ.ఎ.ఎస్. ఆఫీసరుట. శాంతి తండ్రీ ఆయనా ఒకేసారి ట్రయినింగు అయ్యారట. శాంతి ఆయనతో చాలా ఆత్మీయంగా మాట్లాడిందట. ఇక అక్కడ ఉండటం బావుండదనిపించి మోహిని వచ్చేసిందిట.

ఆ సాయంత్రం గోపాల్రావ్ స్టాఫ్ మీటింగు పెట్టి స్వీట్లు, హాట్లు, కూల్‌డ్రింక్స్ విరివిగా అందరికీ యిప్పించాడు.

'ఈయన గోపాల్రావేనా?!' అనేట్టు అందరితో కలుపుగోలుగా ఛలోక్తిగా, జోకులు విసురుతూ, నవ్వుతూ, నవ్విస్తూ మాట్లాడి 'కలా, నిజమా?' అనే విచికిత్స కలిగించాడు.

'స్టాఫ్ మీటింగు' ఎప్పుడూ జరగనంత గొప్పగా జరిగింది. అడిగిన వరాలన్నీ అనుగ్రహించి అందరి మెప్పుపొందాడు గోపాల్రావ్. చివర్న ఒక ఆశ్చర్యకరమైన ప్రకటన చేసాడు.

"వచ్చే నెలలో ఆడిటర్ శాంతి, నేనూ వివాహం చేసుకోబోతున్నాం. మీరందరూ తప్పక రావాలి."

మాకు అప్పుడుగానీ అర్థంకాలా – దూర్వాసుడు విశ్వామిత్రుడిగా మారిన కారణం ఏమిటో...? ●